

సమస్యల భాండాగారాలు

- నిర్లక్ష్యానికి గురవుతున్న గ్రంథాలయాలు
- సౌకర్యాల లేమి.. నిర్వహణ లోపం
- అలంకారప్రాయంగానే భవనాలు
- తీవ్రంగా సిబ్బంది కొరత

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 6: గ్రంథాలయం అనేది విజ్ఞాన భాండాగారం. పుస్తకాలు ఇక్కడ పుష్కలంగా లభిస్తాయి. జ్ఞానం పుష్టిగా దొరుకుతుంది. తద్వారా సామాజిక చైతన్యం, సమకాలీన అంశాలపై అవగాహన, మానవతా విలువలు అబ్బుతాయి. అయితే.. గ్రంథాయాల మనుగడ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. వీటిని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. దీంతో ఇవి నిరాదరణకు గురవుతున్నాయి. నిర్వహణ లోపం వల్ల పాఠకుల అడుగులు గ్రంథాలయాల వైపు పడటం లేదని తెలుస్తోంది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నూతనంగా ఏర్పడిన కొత్తపల్లిగోరితో కలుపుకొని మొత్తం 12 మండలాలు ఉన్నాయి. వీటిలో తొమ్మిది మండలాల్లో ఇదివరకే 10 శాఖ గ్రంథాలయాలు ఉన్నాయి. భూపాలపల్లి పట్టణంలో జిల్లా గ్రంథాలయం ఉంది. అయితే.. ఇందులో చిట్యాల మండల కేంద్రంతో పాటు చల్లగరిగలో సినీ గేయ రచయిత చంద్రబోస్ ఏర్పాటు చేసిన మరో గ్రంథాలయం కూడా ఉంది. అలాగే మొగుళ్లపల్లి, గణపురం, చెల్పూరు, కాటారం, తాడిచర్ల, మహదేవపూర్, రేగొండలో ఉన్నాయి. మహాముత్తారంలో ఉన్న శాఖ గ్రంథాలయం పూర్తిగా మూతపడింది. రేగొండ మండలంలో ని చిన్నకోడెపాకలో ఒక గ్రామ గ్రంథాలయం ఉంది.

ఒకే ఒక్కడు..

జిల్లాలోని 10 గ్రంథాలయాలకు ఒకే ఒక్క రెగ్యులర్ లైబ్రేరియన్ ఉన్నారు. ఆయన రేగొండలో పనిచేయాల్సి ఉండగా ఆయనకు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రికార్డు (జూనియర్) అసిస్టెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. అలాగే భూపాలపల్లి మహదేవపూర్, చెల్పూరు, మొగుళ్లపల్లి మండలాల్లో నలుగురు లైబ్రేరియన్లు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీటన్నింట్లో ఒకే ఒక్కదానికి మాత్రమే రెగ్యులర్ వాచ్‌మన్ ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 10 మంది లైబ్రేరియన్లు, వాచ్‌మన్లు, భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఇద్దరు రెగ్యులర్ లైబ్రే రియన్లు, సెక్రటరీ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు కావాల్సి ఉండగా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

భవనాలు, సౌకర్యాలు లేక..

జిల్లాలోని 10 శాఖ గ్రంథాలయాలకు ఐదింటికి ప్రత్యేక భవనాలు కావాల్సి ఉంది. ఇందులో మహదేవపూర్, రేగొండ, మొగుళ్లపల్లి, కాటారంతోపాటు చిట్యాలలో భవనాలు కావాల్సి ఉండగా ప్రస్తుతం అద్దె ఇళ్లల్లో అవి కొనసాగుతున్నాయి. ప్రస్తుతం చిట్యాలలో గ్రామపంచాయతీ భవనంలో నడుస్తోంది. అద్దె భవనాల్లోని గ్రంథాలయాలకు మరుగుదొడ్ల సౌకర్యం లేదు. తాగునీటి సౌకర్యం అంతంత మాత్రమే ఉంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ గ్రంథాలయాలు తెరిచి ఉంచాల్సి ఉండగా ఎప్పుడు తెరుస్తారో.. ఎప్పుడు మూస్తారో తెలియదని గ్రంథ పాఠకులు చెబుతున్నారు. ఇదిలావుండగా భూపాలపల్లిలోని జిల్లా గ్రంథాలయాన్ని ప్రస్తుతం సింగరేణి బ్యారెక్స్‌లో నడుపుతుండగా ఇటీవల రూ.కోటి నిధులు మంజూరు కాగా భవన నిర్మాణం జరుగుతోంది. ఇంకా అది అసంపూర్తిగానే ఉంది.

అన్నీ ఉన్నా...

అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్టు గ్రంథాలయాల నిర్వహణ కొనసాగుతోంది. గ్రంథాలయాల్లో అన్ని రకాల పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు ఉన్నాయి. నవలలతో పాటు మహానుభావుల చరిత్ర గ్రంథాలు, కవితా సంపుటాలు, డిక్షనరీలు, సైన్స్ ప్రయోగాలకు సంబంధించిన పుస్తకాలు సైతం ఉన్నాయి. వీటితోపాటు వార్తా పత్రికలు, మేగ్జిన్స్, ఉద్యోగాలకు సంబంధించిన సమాచార స్రవంతి పత్రికలు ఉన్నాయి. అయితే.. వీటిని సద్వినియోగం చేసుకునే వారే తగ్గుతున్నారని తెలుస్తోంది. గ్రంథాలయాల నిర్వహణ లోపంతో పాటు డిజిటల్ వైపు వాటిని తీర్చిదిద్దడంలో ప్రభుత్వాలు విఫలం కావడమే ఇందుకు కారణమనే విమర్శలు ఉన్నాయి.

పత్తాకు లేని పన్నులు

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి గ్రామపంచాయతీ నిధుల నుంచి ఎనిమిది శాతం నిధిని కేటాయించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఏ గ్రామపంచాయతీలో కూడా ఆ నిధులను అప్పగించిన దాఖలాలు లేవనే గ్రంథపాలకులే చెబుతున్నారు. భూపాలపల్లిలోని జిల్లా గ్రంథాలయానికి మునిసిపాలిటీ నుంచి రూ.50లక్షలు బకాయి ఉండగా రెండేళ్లుగా చెల్లించడం లేదని అంటున్నారు. గ్రామపంచాయతీల నుంచి సుమారు రూ. కోటి బకాయి ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.



భూపాలపల్లిలో తాత్కాలికంగా అద్దే భవనంలో కొనసాగుతున్న జిల్లా గ్రంథాలయం



భూపాలపల్లిలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవనం

మహిళా సంక్షేమానికి పెద్ద పీట

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

క్యాంపు కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, ఆయన సతీమణి పద్మ

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 6: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యేతోపాటు ఆయన సతీమణి పద్మ హాజరుకాగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆడారు. వారితో కలిసి ఎమ్మెల్యే దంపతులు ఆడిపాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. వారి సంక్షేమం కోసం ఇప్పటికే అనేక పథకాలను అమలవుతున్నాయని, మరికొన్నింటికి సిద్ధమవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, నాయకులు బుర్ర కొంరయ్య, దాట్ల శ్రీనివాస్, అప్పం కిషన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

మేడారంలో భక్తుల సందడి



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, అక్టోబరు 6: తాడ్వాయి మండలం మేడారం వనదేవతల సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వనదేవతలను దర్శించుకున్నారు. సమ్మక్క-సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. దీనికి ముందు జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. దర్శనాల అనంతరం గ్రామ పరిసరాల్లో చెట్ల కింద వంటలు చేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు.

చలువ పందిళ్లు.. సీసీ కెమెరాలు

విద్యా సంస్థలకు దసరా సెలవుల నేపథ్యంలో మేడారానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో వారి సౌకర్యార్థం గద్దెల ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారులు చలువ పందిళ్లు, తాగునీరు ఏర్పాటు చేశారు. అలాగే భక్తుల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో కొన్ని చెడిపోగా వాటికి

మిగతా 8వ పేజీలో...

తుది ఘట్టానికి కొత్త వీసీ ఎంపిక ప్రక్రియ

ముగ్గురిని సెలెక్ట్ చేసిన సెర్చ్ కమిటీ

ఒక్కరిని ఎంపిక చేయనున్న గవర్నర్

కేయూ క్యాంపస్, అక్టోబరు 6: కాకతీయ యూనివర్సిటీ కొత్త వీసీ ఎంపిక ప్రక్రియ ముగిసింది. రాష్ట్ర సచివాలయంలో ఆదివారం సెర్చ్ కమిటీ సమావేశమై కేయూ కొత్త బాస్ ఎంపికను ఖరారు చేసింది. కేయూ వీసీకి దరఖాస్తులు చేసిన 158మంది ప్రొఫెసర్లలో వారికున్న అర్హతల మేరకు ముగ్గురి పేర్లను సీల్డ్ కవర్‌లో రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం పంపారు. వీరి ముగ్గురిలో ఒక్కరిని కేయూ వైస్‌చాన్స్‌లర్‌గా సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు రాష్ట్ర వర్సిటీల చాన్స్‌లర్ అయిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదముద్ర వేసి అధికారికంగా ప్రకటిస్తారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో రెండో అతిపెద్ద వర్సిటీగా గుర్తింపు పొందిన కాకతీయ యూనివర్సిటీకి ఈ దఫా కొత్త బాస్ ఎవరు వస్తారనే విషయం హాట్‌టాపిక్‌గా మారింది. వర్సిటీ వాట్సాప్ గ్రూపుల్లోనూ ఫలానా ప్రొఫెసర్ వీసీగా వస్తున్నారని పోస్టులు వెలువడుతున్నాయి. అయితే కేయూలో కీలక పదవిలో కొనసాగుతున్న ప్రొఫెసరే వర్సిటీకి వీసీగా వస్తున్నారని కొందరు.. ఉస్మానియా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీ నుంచి వస్తున్నారని మరికొందరు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా గతంలో ఎప్పుడూలేని విధంగా ఈ దఫా వర్సిటీలో కొత్త బాస్‌పై విస్తృతంగా చర్చ సాగుతోంది. అలాగే కాకతీయ యూని వర్సిటీ నుంచి ఒక్కరిద్దరు ప్రొఫెసర్లను రాష్ట్రంలోని ఇతర వర్సిటీలకు వీసీలుగా రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తోందనే ప్రచారం తీవ్రస్థాయిలో ఊపందుకుంది. ఇప్పటికే రాష్ట్రంలో పలు వర్సిటీలల్లో కేయూ నుంచి ఒక్కరిద్దరు ప్రొఫెసర్లు వీసీలుగా పని చేశారు. త్వరలోనే రాష్ట్రంలో పలు వర్సిటీలకు వీసీలను అధికారికంగా ప్రకటిస్తారని వర్సిటీ వర్గాలు భావిస్తున్నాయి.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి





బోల్తాపడిన ట్రాక్టర్, తేజావత్ హుస్సేన్ (ఫైల్)

ములుగు, అక్టోబరు 6: ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి చెందిన సంఘటన ములుగు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవగిరిపట్నం గ్రామానికి చెందిన తేజావత్ ధ్వాలి-స్వామి దంపతులకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడైన హుస్సేన్(26) గ్రామానికి చెందిన ఓ రైతు దగ్గర ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక చిర్రకుంట ఆయ కట్టులోని పొలం వద్దకు ట్రాక్టర్‌లో ఎరువుల బస్తాలను తీసుకెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో కుంట కట్టపై నుంచి ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడింది. దాని కింద ఇరుక్కుపోయిన హుస్సేన్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం కోసం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.


గడ్డి మందు తాగి రైతు ఆత్మహత్య



రాజబాపు(ఫైల్)

కాటారం, అక్టోబరు 6: గడ్డిమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై అభినవ్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారానికి చెందిన కొండ రాజబాపు (45), రాజేశ్వరి దంపతులకు ఇద్దరు సంతానం. భార్యాభర్తలు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తనకున్న రెండెకరాల్లో రాజబాపు వరిని పండిస్తున్నాడు. దీంతోపాటు మరో ఆరెకరాలు కౌలుకు తీసుకొని పత్తిని సాగుచేస్తున్నాడు. రెండు, మూడేళ్లుగా ప్రకృతి వైపరీత్యాల కారణంగా దిగుబడి సరిగా రాక రూ. 17 లక్షల అప్పు పేరుకుపోయింది. దీనికి తోడు మూడేళ్ల క్రితం కూతురు కడుపునొప్పి భరించలేక గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఓ వైపు అప్పుల బాధ, మరోవైపు కూతురు మృతి చెందిన మనస్తాపంతో రాజబాపు ఈనెల 1న గడ్డిమందు తాగాడు. అస్వస్థతకు గురైన అతడిని కుటుంబసభ్యుల మహదేవపూర్ సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేశారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే రాజబాపు ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పశువులను తరలిస్తున్న ఇద్దరిపై కేసు



వాహనంలో ఉన్న పశువులు

వాజేడు, అక్టోబరు 6: అక్రమంగా పశువులను తరలిస్తున్న ఇద్దరిపై వాజేడు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి 11 పశువులను హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో వాజేడు మండలం జగన్నాథపురం వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి వెలుతురు, గాలి లేని వాహనంలో నిర్బంధించి తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. పశువులను తరలిస్తున్న షేక్ అలీ, షేక్ మొయినుద్దీన్‌పై కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

డేగ కన్ను

- మావోయిస్టుల కంచుకోటల్లో ఖాకీల పటిష్ఠ నిఘా
- తనిఖీలు, కార్డన్‌సెర్చ్‌లు, కూంబింగ్‌లు ముమ్మరం
- అంతర్రాష్ట్ర వంతెనల వద్ద మరింత అప్రమత్తం



పలిమెల గోదావరి తీరప్రాంతంలోని ఫెర్రిపాయింట్‌ను పరిశీలిస్తున్న కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 6 : మావోయిస్టుల కంచుకోటలపై ఖాకీలు డేగ కన్ను వేశారు. మహదేవపూర్, పలిమెల మండలాలు పోలీసుల కనుసన్నల్లో మెదులుతున్నాయి. తనిఖీలు, కార్డన్‌సెర్చ్ ఇక్కడ పరిపాటి అయినప్పటికీ ఇప్పుడు మరింత ముమ్మరం చేశారు. దీనికి తోడు ములుగు జిల్లా సరిహద్దులోని పలిమెల మండలంపై కూడా పటిష్ఠ నిఘా పెట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోకి మావోయిస్టులు ప్రవేశించే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. గోదావరి ప్రవాహం కాస్త నెమ్మదించడంతో మావోయిస్టులు చొరబడే అవకాశం ఉందని అణువణువూ జల్లెడ పడుతున్నారు.

మాసోత్సవాల నేపథ్యంలో ..

మావోయిస్టు మాసోత్సవాలు సెప్టెంబరు 20 నుంచి అక్టోబరు 21 వరకు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ సర్కిల్ పరిధిలోని కాళేశ్వరం, మహదేవపూర్ పోలీస్ స్టేషన్లకు సుమారుగా 70మందితో కూడిన స్పెషల్ పోలీసు బలగాలను కేటాయించినట్లు తెలిసింది. పలిమెల మండలానికి గతంలోనే ఈ బలగాలను కేటాయించినట్లు సమాచారం. ఇవి నిత్యం తనిఖీలు, కార్డన్‌సెర్చ్‌తో అటవీ గ్రామాల్లో జల్లెడ పడుతున్నాయి. మావోయిస్టులు ఎలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడకుండా అప్రమత్తంగా ఉండేందుకు ప్రత్యేక బలగాలను సరిహద్దు పోలీస్ స్టేషన్లకు కేటాయించారు. ఇదే క్రమంలో మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం, మేడిగడ్డ అంతర్రాష్ట్ర వంతెనల వద్ద ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. వీటితో పాటు పలిమెల మండలంలోని గోదావరి పరీవాహక ప్రాంతంలోని దమ్మూర్, సర్వాయిపేట, నీలంపల్లి, వెంచంపల్లి, బూర్గుగూడెం, ముకునూర్ ఫెర్రిపాయింట్ల వద్ద భద్రత పెంచినట్లు తెలుస్తోంది. ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ రాంచదర్‌రావు, ఎస్సైలు పవన్ కుమార్, తమాషారెడ్డి, చక్రపాణి నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. ఫెర్రిపాయింట్లను నిత్యం పరిశీలిస్తున్నారు. గోదావరి తీర ప్రాంత ప్రజలతోపాటు గొత్తికోయగూడాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి అనుమానిత వ్యక్తుల సంచారంపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. తాజాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్-దంతెవాడ జిల్లా సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో మావోయిస్టులు సరిహద్దులో ఉన్న జిల్లాల్లోకి ప్రవేశించే అవకాశం ఉండటంతో రాత్రింబవళ్లు తనిఖీలు, కూంబింగ్‌లు చేపడుతున్నట్లు సమాచారం. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఏక్షణాన ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటున్నారు.



మేడిగడ్డ బ్యారేజీ వద్ద తనిఖీలు చేస్తున్న ఎస్సై పవన్ కుమార్

జలపాతం వద్ద విషాదం

- 'దుసపాటిలొద్ది'లో నీట మునిగి బీటెక్ విద్యార్థి మృతి
- మృతుడు పెద్దపల్లి జిల్లా వాసి
- కాలేజీలో చేరిన కొద్దిరోజుల్లోనే కానరాని లోకాలకు..





అభినవ్ మృతదేహం, అభినవ్ (ఫైల్)

వాజేడు, అక్టోబరు 6: విహార యాత్ర విషాద యాత్రగా ముగిసింది. మండలంలోని కొంగాల అటవీ ప్రాంతంలో ఉన్న దుసపాటిలొద్ది జలపాతంలో బీటెక్ విద్యార్థి ఒకరు నీటమునిగి మృతి చెందాడు. తోటి మిత్రులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన బండారి అభినవ్(18) ఘట్‌కేసర్‌లో బీటెక్ ఈఈఈలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవలే కాలేజీలో తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో అభినవ్ మిత్రులు రాహుల్, లోకేష్, పాషా, అద్విక్, రక్షిత్, కౌశిక్‌తో కలిసి ఘట్‌కేసర్ నుంచి కారులో వాజేడు మండలంలోని దుసపాటిలొద్ది జలపాతం సందర్శనకు వచ్చారు. గంట పాటు అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్ చేసిన అనంతరం జలపాతం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో అభినవ్ మిత్రులు ఈత కోసం జలపాతంలో దిగారు. అస్సలే ఈత రాని అభినవ్ కూడా వారిని అనుసరించాడు. ఒక్కసారిగా లోతుకు వెళ్లిపోయిన అభివన్ గల్లంతయ్యాడు. మిత్రులు రాహుల్, కౌశిక్ కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా

మిగతా 8వ పేజీలో...



ప్రమాదపుటంచున ప్రయాణం


ప్రమాదకరంగా వ్యవసాయ బావి

గీసుగొండ నుంచి పోతురాజుపల్లికి వెళ్లే దారిలో వ్యవసాయ బావి పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా ఉంది. బావి పక్కనే ఉన్న రోడ్డుపై బుంగ పడి ఆందోళన కరంగా ఉంది. ప్రయాణికులు ఎవరైనా అటువైపు నుంచి వస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బావిని, రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

గుంటగుంటకు సర్వే సాధ్యమేనా..?

● డిజిటల్ క్రాప్ సర్వేపై ఏఈవోల ఆందోళన ● ఉన్న సిబ్బందితో పనిచేయడం కుదరదని నిరసన
● ఏజెన్సీల ద్వారా సర్వే చేపట్టాలని విజ్ఞప్తి ● 17 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

హసన్‌పర్తి, అక్టోబరు 6: రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వేను ఏఈవోలు బహిష్కరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఏఈవోలపై ఒత్తిడి తేవడంపై 17 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. నిరసనలో భాగంగా జిల్లా వ్యవసాయాధికారులు, జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ని కలిసి విస్తరణాధికారులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

పని ఒత్తిడితో సతమతం

ఇప్పటికే గ్రామ స్థాయిలో సహాయకులు లేకున్నా వ్యవసాయ విస్తరణాధికారులు ఏడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ కార్యక్రమాన్ని ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ విజయవంతంగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే రైతు బంధు, రైతు బీమా వంటి 49 రకాల విధులు నిర్వహిస్తూ సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో డీసీఎస్ విషయంలో సాగులో ఉన్న కోటిన్నర ఎకరాల వ్యవసాయ భూములలో ప్రస్తుతం ఉన్న 26 వందల మంది ఏఈవోలతో డిజిటల్ క్రాప్ సర్వే చేయించాలని చూడడం సరికాదని ఏఈవోలు అంటున్నారు. కాగా, ఈ సర్వే కోసం 12 వేల మంది సిబ్బంది అవసరం ఉంటుందని, కానీ కేవలం 26 వందల మంది వ్యవసాయ విస్తరణాధికారులతోనే సర్వే చేయించాలని ప్రభుత్వం చూస్తోందన్నారు.

వేధింపులు

ఒక రైతుకు తనకున్న వ్యవసాయ భూమిలో వేసున్న పంటల నమోదులో గుంటగుంటకు సర్వే చేసి రిపోర్టు ఇవ్వడం విస్తరణాధికారులకు సాధ్యమయ్యే పనికాదన్న విమర్శలున్నాయి. 60 శాతం మహిళా సిబ్బంది ఉన్న ఈ శాఖలో ప్రతీ గుంటకు ఫొటో క్యాప్చర్‌తో పాటు పంట నమోదు, ఇతర వివరాలను నమోదుచేయడం సాధ్యమయ్యేపని కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే డిజిటల్ క్రాప్ సర్వే సమస్యకు పరిష్కారం చూపకుండా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధిత ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధులకు హాజరవుతున్నప్పటికీ వారికి సాధారణ సెలవుగా పరిగణిస్తూ మెమోలు జారీ చేస్తున్నారని తలలు పట్టుకుంటున్నారు.


మంత్రి తుమ్మలకు వినతి పత్రాన్ని అందజేస్తున్న జాక్ నేతలు

రాష్ట్ర వ్యాప్త నిరసనలు

రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేపై తీసుకున్న నిర్ణ యంతో ఏఈవోలపై అదనపు పనిభారం పడుతోందని, వెంట నే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రైవేటు ఏజెన్సీ ల ద్వారా సర్వే పనులు చేయించాలని కోరుతూ ఏఈవోలు రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేపడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఏఈవోల సమస్యను పట్టించుకోకుండా జాప్యం చేస్తుండడంతో నిరసనలు 17వ రోజుకు చేరుకున్నా యి. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ఆందోళనలు తీవ్రం కాకుండా వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని జాక్ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఏజెన్సీకి అప్పగించాలని డిమాండ్

కేంద్ర ప్రభుత్వ విధివిధానాల ప్రకారం ప్రతీ రాష్ట్రం వివిధ ఏజెన్సీల ద్వారా వ్యవసాయ శాఖ సిబ్బంది పర్యవేక్షణలో ఈసర్వేలు చేయించాల్సిందిగా ఆదేశాలు న్నాయి. ఆ ప్రకారమే మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిస్సా వంటి రాష్ట్రాలలో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా సర్వేలు కొనసాగుతున్నాయి. కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే చాలీచాలని ఏఈవోలతో ఈ సర్వే నిర్వహించాలని చూడడం పట్ల తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏజెన్సీల ద్వారా వివిధ రాష్ట్రాలలో చేపడుతున్న సర్వే వివరాలను ఇప్పటికే వివిధ జిల్లాల వ్యవసాయ అధికారులకు, కలెక్టర్లకు, ప్రభుత్వ ప్రతినిధులకు, వ్యవసాయ శాఖ మంత్రికి, డైరెక్టర్‌కు వివరించినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఏఈవో జాక్ నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఏఈవోలపై పెరుగుతున్న ఒత్తిడిపై సానుకూల దృక్పథంతో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా సర్వే నిర్వహించి ఏఈవోలపై పనిభారాన్ని తగ్గించాలని జాక్ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఎస్సారెస్పీ కెనాల్‌కు బుంగ

టెక్స్‌టైల్ పార్కు ముప్పు

ఎస్సారెస్పీ ప్రధానకాలువతో పాటు ఉపకాలువలకు నీరు వదలటంతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ప్రధాన కాలువ వద్ద పలుచోట్ల బుంగలు ఏర్పడ్డాయి. దీంతో కాలువ స్టోనింగ్ శిథిలమై కాలువలో ప్రవహించే నీరు బయటికి వచ్చే ప్రమాదం పొంచి ఉంది. నీటి ప్రవాహం పెరిగితే టెక్స్‌టైల్ పార్కులోకి కాలువ వరద నీరు చేరే అవకాశం ఉంది. ఇక్కడే కాకతీయ కెనాల్ పొడవునా ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం ఇదేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే స్థానిక రైతులు కోరుతున్నారు.

- ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.


వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- కథ-2023 సంకలనం ఆవిష్కరణ
- కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
- అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి


కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త ముప్పా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.

సీతాఫలం.. యమ పిరం..

● నగరంలో కిలో రూ.200పైనే.. ● ఇబ్బందుల్లో వినియోగదారులు


హనుమకొండలో రోడ్డు పక్కన సీతాఫలాలను విక్రయాలు చేస్తున్న ప్రజలు

బాలసముద్రం, అక్టోబరు 6: శీతాకానికి ముందే సీతాఫలాలు నగరానికి చేరుకున్నాయి. ప్రతీ సంవత్సరం శీతాకాలంలో మూడు నెలల పాటు సీతాఫలాల విక్రయాలు నగరంలో జోరుగా సాగుతుంటాయి. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్, నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు సీతాఫలాలను డబ్బాలలో పెట్టి విక్రయాలు జరుపుతుంటారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సీతాఫలాల విక్రయాలు మొదలయ్యాయి. బుధవారం పండ్లు కొనుగోలు చేయడానికి ఆయా ప్రాంతాలకు వచ్చిన ప్రజలు ధరలను చూసి వెనుదిరిగారు. ప్రస్తుతం సీతాఫలాలు ధరలను చూసి బెంబెలెత్తిపోతున్నారు. మంచి ఫలాలకు కిలో ధర రూ.200 నుంచి రూ.250 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. దీంతో కొందరు కొనుగోలుదారులు వారు అడిగిన కాడికి ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి నగరానికి..

సీతాఫలాలను జనగామ జిల్లా, సిద్దిపేట, ఇతర జిల్లాల నుంచి ఎడ్ల బండ్లు, ప్రత్యేక వాహనాల్లో తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు. సీజన్ కావడంతో ప్రజలు కొనుగోలు చేయడానికి ముందుకొచ్చినప్పటికీ ధరలను చూసి జంకుతున్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండాల్సిన ధరలు ఒక్కసారిగా పెరగడంతో ప్రజలు కొనుగోలు చేయలేకపోతున్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం సీతాఫలాలకు డిమాండ్ పెరిగిందని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. ఒకవైపు అధిక వర్షాలు కురువడంతో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన సీతాఫలాలను కొంత మంది సిండికేట్‌గా మారి ఎక్కువ ధరలు పెంచి విక్రయాలు జరుపుతున్నట్లు స్థానిక ప్రజలు వాపోతున్నారు. చిన్న సైజు ఉన్న సీతాఫలాలు కిలోకు రూ.150 ఉండగా, పెద్ద సైజులో ఉన్నవి కిలో ధర రూ.200 నుంచి రూ.250 వరకు పలుకుతోంది.



ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

వెంకటాపూర్(రామప్ప), అక్టోబరు 6: దసరా పండుగను పురస్కరించుకుని దేవీ శరన్నవరాత్రి వేడుకలు మండలంలో కొనసాగుతున్నాయి. నల్లగుంట, పాలంపేట, వెంకటాపూర్, కేశవాపూర్, తదితర గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత ఆదివారం లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా మండలకేంద్రానికి చెందిన కొంపెల్లి ప్రదీప్‌రెడ్డి-లక్ష్మి దంపతులు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ముప్పు పూర్ణేందర్, పల్నాటి సురేష్, కోటి, స్వామి, చింతిరెడ్డి రమణారెడ్డి, రమేష్, రాజాలింగేశ్వర్, రాజేష్, హరీష్, ఆదిత్య, సన్నీ, రాఘవేంద్రచారి, వరుణ్, శ్యామ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాచండీ దేవిగా..

మంగపేట: కమలాపురంలోని శ్రీ సీతారామాచం ద్రస్వామి దేవాలయం, ఆదర్శకాలనీ, మంగపేటలోని శ్రీ ఉమాచం ద్రశేఖరస్వామి దేవాలయం, బోరునర్సాపురంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయం, చెరుపల్లిలోని రామాల యం, తిమ్మంపేటలో బొడ్రాయి వద్ద, మల్లూరు రామాలయం వద్ద వాడగూడెం, రమణక్కపేట, రాజుపేట తదితర గ్రామాల్లో దేవీనవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతు న్నాయి. అమ్మవారిని ఆదివారం మహా చండీదేవిగా అర్చకులు, పూజారులు అలంకరించి, భక్తులకు దైవ దర్శనాలను గావించారు.

కూష్మాండ అవతారంలో..

మహదేవపూర్: పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ శుభానందేవి ఆలయంలో దేవీ నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. నాలుగోరోజు కూష్మాండదేవి అలంకా రంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. తొమ్మిదిరోజుల పాటు జరిగే ఈ నవరాత్రి ఉత్సవాలు భజనా భజంత్రీలతో, భక్తి పాటలతో అమ్మవారికి నిత్య పూజలు చేస్తున్నారు. ఆదివారం నాలుగోరోజు కావడంతో భక్తులు దూర ప్రాంతాల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి అనేక మంది భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని శుభానందదేవికి పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లలితా త్రిపుర సుందరీదేవిగా..


కూష్మాండ దేవి అవతరంలో శుభానందదేవి

ములుగు కలెక్టరేట్: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ములుగులోని రామాలయంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొలువుదీరిన దుర్గా మాత నాలుగో లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈసంద ర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పైడిమల్ల శోభారాణి-అనిల్‌కుమార్ దంపతులు అన్న ప్రసాద వితరణ చేపట్టగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు బండారి మోహన్‌కుమార్, అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, సభ్యులు గట్ల సత్యనారాయణ, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, కొత్త సురేందర్, గట్ల శ్రీనివాసరెడ్డి, ఆవుల ప్రశాంత్‌రెడ్డి, అన్నపురెడ్డి ప్రమోద్‌రెడ్డి, కుమార్, సాంబయ్య, నిరంజన్, జశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.


మంగపేటలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

అన్నాపూర్ణాదేవిగా..

గణపురం: మండంలోని చెల్పూరులో నెలకొల్పిన దుర్గా మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 108 రకాల నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. నాలుగో రోజు అన్నాపూర్ణాదేవి అవతారంలో మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా సాముహిక మహా వ్రతం, మంగళహారతి, దేవీ ప్రవచనం వంటి కార్యక్రమాలు జరిగాయి. ఆర్యవైశ్యులు ఐత రమేష్, సత్యనారాయణ, అడ్డ గూటి రాజేందర్, పున్నంచందర్, రవి, ప్రవీణ్, ప్రశాంత్, దిలీప్, సాయికృష్ణ, అఖిల్ శివ, హరీశ్ పాల్గొన్నారు.

గాయత్రిదేవిగా...

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మండల కేంద్రంలోని రామాలయం, సాయిబాబా, కన్యకాప రమేశ్వరి స్టార్ యూత్ ఆధ్వర్యంలో 26వ వసంతోత్సవ సంబరాలు ప్రధాన అర్చకులు ఎర్ల ప్రగడ రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. నాలుగురోజు రోజు అమ్మవారిని గాయత్రి దేవి అవతారంలో అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కుంకుమార్చన, మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర యువజన కార్యదర్శి ధనసరి సూర్య హాజరై ప్రారంభించారు. కమిటీ సభ్యుల వెలుకుర్తి లక్ష్మణచారి, నూక ప్రభాకర్, చేల్పురి రామనాథం, ముక్కెర బిక్షపతి, పాలకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సర్కారు

ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల, అక్టోబరు 6: పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. అనారోగ్యం బారిన పడి ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్న పేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చేయూ తనిస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన 77 మంది లబ్ధిదారులకు రూ. 26లక్షల70వేల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు. పేదల అభ్యు న్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంద న్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుతు న్నామని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, చిలుకల రాయకొమ్రు, దొడ్డి కిష్టయ్య, గడ్డం కొమురయ్య, రాజేశ్వర్‌రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రఫీ, నాయకులు గంగాదరి రవీందర్, అల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేస్తున్న ఎమ్మెల్యే

రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌కు జిల్లా పోలీసుల ఎంపిక

ములుగు, అక్టోబరు 6: తెలంగాణ రాష్ట్ర స్థాయిలో తొలిసారి నిర్వహిస్తున్న పోలీస్ డ్యూటీ మీట్‌కు ములుగు జిల్లా పోలీసులు ఎంపికైనట్లు ఎస్పీ శబరీశ్ ఒక ప్రకట నలో తెలిపారు. సెప్టెంబరు 25న జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి అక్టోబరు 3, 4 తేదీల్లో రామగుండం కమిషనరేట్ పరిధిలో జరిగిన జోనల్ పోటీల్లో పాల్గొన్న తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పరిశోధన, శాస్త్రీయ దర్యాప్తు విభాగంలో మొదటి స్థానంలో నిలిచి నట్లు తెలిపారు. విధ్వంస వ్యతిరేక తనిఖీ విభాగంలో ములుగు ఏఎస్సై జాకీర్ హుస్సేన్, కానిస్టేబుల్ రాజేష్, కంప్యూటర్ అవగాహనలో కానిస్టేబుల్ అనిల్, ఆఫీస్ ఆటోమేషన్‌లో కానిస్టేబుల్ భరత్, డాగ్ స్క్వాడ్, మందుపాతర తనిఖీ విభాగంలో నరేష్ అత్యు త్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారని పేర్కొన్నారు. ఈనెల 14నుంచి 18వ తేదీ వరకు హైద రాబాద్‌లో జరిగే ఈ పోటీలలో పాల్గొంటారని తెలి పారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన పోలీసు అధికారులను అభినం ఎస్పీ అభినందించారు.

దేవరాంపల్లి వాసికి సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న నవీన్‌రావు

కాటారం, అక్టోబరు 6:మండలంలోని రేగులగూడెం జీపీ పరిధిలోని దేవరాంపల్లికి చెందిన మాజీ సర్పంచ్ అయిలినేని నవీన్‌రావు బహుజన సాహిత్య అకాడమీ ద్వారా సేవారత్న అంతర్జాతీయ అవార్డు-2024 అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని తిరుపతిలో బహుజన సాహిత్య అకాడమీ ఎనిమిదో సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ ఆదివారం జరిగింది. జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి సుబ్రమణియన్, కాన్ఫరెన్స్ కన్వీనర్ విష్ణువర్ధన్, సినీ డైరెక్టర్ ప్రేమ్‌రాజ్ చేతుల మీదుగా నవీన్‌రావు అవార్డును స్వీకరించారు.. అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ప్రజా ఉద్యమకారులు, సంఘసేవకులు, రచయితలు, కవులు, స్వచ్ఛందసంస్థలకు అవార్డులు అందిస్తున్నట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్, రాష్ట్ర కో-ఆర్డినేటర్ విష్ణు, కాంగ్రెస్ నేత తెప్పల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భయం గుప్పిట్లో ఖాసింపల్లి!

45 రోజుల వ్యవధిలో 25 మంది మృతి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), అక్టోబరు 6: ఖాసింపల్లి.. భూపాలపల్లి కూతవేటు దూరంలో ఉంటుంది. ఇది ఒకప్పుడు గ్రామంగా ఉండేది. ఇప్పుడు భూపాలపల్లి పట్టణ అంతర్భా గమైంది. ఇక్కడి ప్రజలు కొన్ని రోజులుగా భయాందోళనతో వణికి పోతున్నారు. ఈ గ్రామంలో సుమారు ఐదు వేల జనాభా ఉంది. గడిచిన 45 రోజుల వ్యవధిలో 25 మంది గ్రామస్థులు మృతి చెందడం ఆందోళనకు కారణమైంది. వీరిలో కొందరిది సహజమరణమైతే, మరికొందరిది హఠాన్మరణం. ఇంకొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. దీంతోపాటు కొందరు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఇలా ఒకరి దశదిన కర్మ పూర్తికాక ముందే మరో మరణం చోటు చేసుకోవడంతో గ్రామస్థుల్లో ఒకింత భయం నెలకొంది. ఈ క్రమంలో పలు పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. ఊరికి కీడు పట్టిందంటూ కొందరు ప్రచారం మొదలెట్టారు. అయితే.. ఇవన్నీ సహజ మరణాలేనని సామాజికవేత్తలు అంటున్నారు. మూఢన మ్మకాలతో ఏదోదో ఊహించుకొని మదనపడొద్దని అంటున్నారు.



రోడ్డు కష్టాలను తీర్చుకున్న రైతులు

వాజేడు, అక్టోబరు 6: అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో రైతులే తమ కష్టాలను తీర్చుకున్నారు. వాజేడు-గుమ్మడిదొడ్డి రహదారి కొంగాల వాగు సమీపంలో ఇటీవల వచ్చిన వరదలకు పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డు మీదుగా నిత్యం రైతులు రాకపోకలు సాగించాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రధాన రహదారికి మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోకపో వడంతో రైతులంతా ఏకమై స్వచ్ఛం దంగా ఆ పనులను పూర్తి చేసుకున్నారు. సుమారు రూ. 30 వేల వరకు ఖర్చు చేసి గ్రావెల్‌తో గుంతలు పడిన రోడ్డును చదును చేసుకున్నారు. అదే విధంగా జగన్నాథపురం-వాజేడు ప్రధాన రహ దారిపై సైతం పలుచోట్ల గుంతలు పడ గా గ్రావెల్‌తో నింపి చదును చేశారు. రైతుల కృషిని పలువురు అభినందించారు.

పాముకాటుకు గురైన రైతు

వెంకటాపురం(నూగూరు), అక్టోబరు 6: మండలంలోని పాత్రాపురం గ్రామంలో రైతు పాముకాటుకు గురైన సంఘటన ఆదివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామంలోని అల్లి రవీంద్ర గ్రామశివారులో ఉన్న తన పొలంలో పనిచేస్తుండగా పాము కాటేసింది. దీంతో సమీపంలో ఉన్న రైతులు గమనించి సంఘటనాస్థలికి చేరుకుని పామును చంపివేశారు. అనంతరం రవీంద్రను ఆటోలో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం రవీంద్ర ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

రెండో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలి

వెంకటాపురం(నూగూరు), అక్టోబరు 6: మండలంలో అందరికీ అందుబాటులో ఉండేవిధంగా రెండో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా ఉపాధ్యక్షుడు చింత సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో ఉన్న సివిల్ ఆస్పత్రిని వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారని గానీ, సౌకర్యాలు కల్పించలేదని అన్నారు. బెడ్ల సౌకర్యం కల్పించలేదని, గైనకాలజిస్ట్ లేక ప్రసవాలు సక్రమంగా జరగడంలేదని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉండేవిధంగా రెండో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని, లేనట్లయితే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈసమావేశంలో నాయకులు అట్టం రాంబాబు, గొంది శివరాజు, బొగ్గం రంజిత్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ నిమజ్జన స్థలాల వద్ద పారిశుధ్య పనులు

కాటారం, అక్టోబరు 6:మండలవ్యాప్తంగా జీపీల పరిధిలో బతుకమ్మ నిమజ్జన స్థలాలు, దారులను శుభ్రం చేయడం, వీధి దీపాలను ఏర్పాటు చేసే ప్రక్రియ ఆదివారం జరిగింది. కాటారం జీపీ పరిధిలోని గారెపల్లి చింతల చెరువు వద్ద పారిశుధ్య కార్మికులు నిమజ్జనం కోసం వెళ్లే రహదారుల వెంట చెత్తాచెదారం, గడ్డిని శుభ్రం చేశారు. పలు జీపీల్లోనూ రోడ్ల వెంట గడ్డిని తొలగించారు. ఈ కార్యక్రమాల్లో జీపీ కార్యదర్శులు సమీర్‌ఖాన్, ఉమాదేవి, శ్రీనివాస్, కృష్ణవేణి, నాగరాజు, రాకేష్, జ్యోత్స్న, గంగాధరన్, శివ, శంకర్, సునిత, నవ్య, ప్రసన్న, రాజశేఖర్, సురేష్, సాయికృష్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణను వెంటనే అమలు చేయాలి : ఎమ్మార్పీఎస్

మహదేవపూర్, అక్టోబరు 6 : ఎస్సీ వర్గీకరణను వెంటనే అమల్లోకి తేవాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీలలోని 59 కులాలకు వర్గీకరణ ఫలాలను అందించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. డీఎస్సీ నియామకాల్లో ఎస్సీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎస్సీల హక్కుల సాధనకోసం ఈనెల 9న భూపాలపల్లిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి మంత్రి రవితేజ, మండల ఉపాధ్యక్షుడు చింతకుంట సదానందం, యువజన నాయకులు బెల్లంపల్లి ప్రవీణ్‌కుమార్, చింతకుంట సదానందం, బెల్లంపల్లి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత.. ఇద్దరిపై కేసు

వాజేడు, అక్టోబరు 6: గుడుంబాను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులకు చిక్కారు. వాజేడు ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం... జాతీయ రహదారి మండపాక వద్ద పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా బైక్‌పై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా సంచుల్లో గుడుంబా లభ్యమైంది. ఏటూరునాగారం మండలం శంకర్రాజుపల్లికి చెందిన అత్కూరి రవి, అత్కూరి నాదును స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి 200 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.

10 తులాల బంగారు నగల చోరీ

కరీంనగర్, అక్టోబరు 6: సిరిసిల్ల నుంచి బస్సులో కరీంనగర్‌కు వస్తున్న సమయంలో బ్యాగులో ఉన్న 10 తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు బాధితురాలు ఆదివారం కరీంనగర్ వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలానికి చెందిన త్రివేణి భర్త సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మం డలంలో జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. భారా భర్తలు అక్కడే నివాసం ఉంటున్నారు. దసరా సెలవుల సందర్భంగా త్రివేణి ఆదివారం కోనరావుపేట నుంచి సిరిసిల్ల బస్టాండ్‌కు వచ్చి అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో మధ్యాహ్నం కరీంనగర్‌కు చేరుకుంది. ఆ తర్వాత తన వెంట ఉన్న బ్యాగులో చూసుకోగా 10 తులాల బంగారు నగలు కనిపించలేదు. సిరిసిల్లలో బస్సు ఎక్కిన సమయంలో ఉన్నాయని, కరీంనగర్‌కు చేరుకునే సరికి తన బ్యాగు తెరిచి ఉందని, అందులో ఉన్న బంగారు నగలు కనిపించలేదని బాధితురాలు తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు విచారణ ప్రారంభించి కరీంనగర్ బస్టాండ్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు.

జలపాతం వద్ద విషాదం

(5వ పేజీ తరువాయి)

పోయింది. సమాచారం అందుకున్న వాజేడు ఎస్సై హరీశ్, ములుగు ఫైర్ స్టేషన్ ఎస్సై కుమార స్వామి సిబ్బం దితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. జాలర్ల సాయంతో వెతకగా అభినవ్ మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అభినవ్ తండ్రి శ్రీని వాస్ గోదావరిఖనిలో సింగరేణి ఉద్యోగం చేస్తున్నాడు. అభినవ్‌తోపాటు కూతురు ఉంది.

ఇంట్లో చెప్పకుండా వచ్చి...

అభినవ్, అతడి మిత్రులు తాము విహారయాత్రకు వెళ్త న్నట్టు తమ కుటుంబాలకు సమాచారం ఇవ్వలేదని తెలి ంది. కొద్దిరోజుల క్రితమే ఇంజనీరింగ్‌లో చేరిన వీరి మధ్య ఇటీవలే స్నేహం కుదిరింది. కాలేజీలో కొత్తగా చేరిన కొద్ది రోజులకే వీరు విహార యాత్రకు వీరు ప్లాన్ చేసుకొని తమ ఇళ్లల్లో ఎవరికీ చెప్పకుండానే దుసపాటిలొద్ది జలపాతం చూడ్డానికి బయల్దేరారు. ఇంతల్లోనే ఈ ప్రమా దం చోటు చేసుకోగా కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇలాంటి దుర్ఘటనలే ఇటీవల ఎక్కువయ్యా యని, చదువు కోవడానికి పిల్లలను కాలేజీకి పంపిస్తే విహారయాత్రల పేరిట తల్లిదం డ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయం ప్రారంభం

ఏటూరునాగారం, అక్టోబరు 6: మాడుగురి పోత రాజు-రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థం పీఆర్ఆర్ యూనిటీ, చారి టబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటూరునాగారంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యద ర్శి ధన సరి సూర్య ప్రారంభించారు.కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెం కన్న, యూత్ కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు వసంత శ్రీనివాస్ యాదవ్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. అయ్యూబ్ ఖాన్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఖలీల్ ఖాన్, జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలీయాబీ తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో భక్తుల సందడి

(5వ పేజీ తరువాయి)

మరమ్మ తులు చేయించారు. కొన్ని పనిచేయకపోవడంతో వాటిస్థానంలో కొత్తవి అమర్చారు.

దొరకని ప్రసాదం


ప్రసాదం కోసం పూజారులను అడుగుతున్న భక్తులు

వనదేవత గద్దెల వద్ద డ్యూటీలు చేస్తున్న పూజారులు భక్తులకు ప్రసాదం అందించడంలో విఫలమయ్యారని భక్తులు విమర్శిస్తున్నారు. సూదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి దేవతలను దర్శించుకోవడానికి వచ్చినా ప్రసాదం దొరకని పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సుమారు 10 వేల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారని అధికారులు చెబుతుండగా, వీరిలో చాలామందికి ప్రసాదం దొరకలేదని తెలుస్తోంది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మొగుళ్లపల్లి, అక్టోబరు 6: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆది వారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరి గింది. 1982-83 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యా ర్థులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు గురువులు, తోటి మిత్రులను ఆత్మీ యంగా పలకరించుకుని యోగక్షేమాలను తెలుసు కున్నారు. నాటి మధు జ్ఞాపకాలను నెమరువేసు కున్నారు. విద్యను నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలు, మెమొంటోలతో సన్మానించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

తాడ్వాయి, అక్టోబరు 6: మండ లంలోని బీరెల్లి గ్రామానికి చెందిన మంతెన సందీప్ ఇటీవల మృతిచెం దగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆధ్వర్యంలో నాయ కులు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామ ర్శించారు. 50కిలోల బియ్యం తోపాటు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్ర మంలో పార్టీ నాయ కులు ఎమ్డీ.ముజ ఫ్ఫర్ హుస్సేన్, పాక సాంబయ్య, బెజ్జూరి శ్రీనివాస్, ఇర్సవడ్ల భవాని, నారాయణ, వంగరి సదానందం, కాయిత లింగాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానిని విమర్శించడం సీతక్కకు తగదు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 6: ప్రధాని నరేంద్రమోదీని విమర్శించడం రాష్ట్ర మంత్రి సీతక్కకు తగదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సరికొండ బలరాం అన్నారు. ములుగులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అమలుకాని అనేక హామీ లిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను అనేక రకాలు గా మోసం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా మంత్రి సీతక్క మేల్కొని చౌకబారు మాటలు మాట్లాడకుండా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, హితవు పలికారు. ఈ సమా వేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గాధం కుమార్, నాయ కులు కొత్త సురేందర్, శీలమంతుల రవీంద్రాచారి, జినుకల కృష్ణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

కాటమయ్య రక్షణ కవచంపై అవగాహన

కృష్ణకాలనీ (భూపాలపల్లి), అక్టోబరు 6: భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి (ఎస్ఎం) గ్రామ శివారు సోలిపేట తాటి వనంలో కాటమయ్య రక్షణ కవచం విని యోగంపై అవగాహన కార్యక్రమాన్ని ఆది వారం నిర్వహించారు. ఎక్సైజ్, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కల్లు గీత కార్మికుల ప్రా ణాల రక్షణకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం పేరుతో ఆరు రకాల కిట్లును అంది స్తోంది. ఈ క్రమంలో అట్టి కిట్టు విని యో గంపై గీత కార్మికులకు అవగాహన కల్పిం చారు. ఎక్సైజ్ ఎస్సై రబ్బాని, కల్లు గీత కార్మి క సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని శివశం కర్, ట్రైనర్లు తాళ్లపల్లి నర్సయ్యగౌడ్, బుర్ర శ్రీనివాస్, రంగు సత్యనారాయణ, పులి రమే ష్‌తో పాటు ఎక్సైజ్, బీసీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.